సాక్షి చిత్తూరు

సోమవారం । 4 । ఆగస్టు । 2025



అసమర్థ పాలనకు నిదర్శనం

హాస్టళ్లు, పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలకు ప్రభుత్వం అనుమతి నిరాకరణపై విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి. - 8లో



నగరి-దిండివనం రైలు కూత

19 ఏళ్లుగా ఊరిస్తున్న రైల్వేలైనుకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో పనులకు మోక్షం లభించింది. - 8లో



బోయకొండ కిటకిట

బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. క్యూలైన్లు అన్నీ రద్దీగా మారిపోయాయి. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 4వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

నేడు పోలీసు గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కన ఉన్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

6న విద్యుత్ గ్రీవెన్స్


చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6న బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నారు. స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఈఈ మునిచంద్ర తెలిపారు. చిత్తూరు, పూతలపట్టు వినియోగదారులు సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని వివరించారు.

5 నుంచి జిల్లా స్థాయి క్రీడా పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 29న జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడా పోటీలను శాప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు తిరుపతిలోని ఎస్వీయూ క్రీడా మైదానం, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల హాకీ గ్రౌండ్, పాత ఏజీఎస్ కళాశాల మైదానాల్లో అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, హాకీ, వాలీబాల్ క్రీడల్లో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులు, జట్లకు ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు జోనల్ స్థాయిలో, అక్కడ ప్రతిభ చూపిన జట్లు, క్రీడాకారులకు 16 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు తప్పనిసరిగా జిల్లాకు చెందిన వారై ఉండాలని, అలాగే 22 ఏళ్లలోపు వయస్సున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 90596 06346, 99484 44759 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

నిర్బంధ మార్గదర్శకులు

- పీ-4లో దత్తత తీసుకునేందుకు ముందుకు రాని ఆశావహులు
- ఉద్యోగులనే మార్గదర్శకులుగా చేరుస్తున్న అధికారులు
- ముఖం చాటేస్తున్న కూటమి ఎమ్మెల్యేలు
- సచివాలయ ఉద్యోగులకు 3 నుంచి 5 కుటుంబాలు దత్తత
- రూ.30 వేలలోపు జీతమున్న ఉద్యోగికి దత్తత సాధ్యమేనా?
- టీచర్లు, ఇతర ఉద్యోగులపై ఒత్తిడి తెస్తున్న ప్రభుత్వం



సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలో పీ-4 దుస్థితి ఇలా..

మండలం	బంగారు కుటుంబాలు	దత్తత తీసుకోవాల్సినవి
గుడుపల్లి	1,725	1,467
కుప్పం రూరల్	2,289	1,799
కుప్పం అర్బన్	1,371	340
రామకుప్పం	2,361	2,194
శాంతిపురం	2,661	1,536
మొత్తం	10,407	7,336

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పీ-4 కార్యక్రమం దారి తప్పింది. క్షేత్రస్థాయిలో ఆదరణ లేక ఉద్యోగులపై ఒత్తిడి తెస్తోంది. సంపన్నులు పేద కుటుంబాలను దత్తత తీసుకుని బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దేలా పీ-4 కార్యక్రమాన్ని ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. అయితే క్షేత్రస్థాయిలో ఎవరూ ముందుకు రాకపోవడంతో కార్యక్రమం అబాసుపాలవుతోంది. కూటమి ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాలకు ఉద్యోగులను బలి చేస్తోందనే విమర్శలు గుప్పుమంటున్నాయి. చిరు జీతాలపై ఆధారపడే ఉద్యోగులపై ఒత్తిడి తీసుకొచ్చి అమలు చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పేద కుటుంబాలను బంగారు కుటుంబాలు అనే పేరుతో నామకరణ చేశారు. దత్తత తీసుకునే వారిని మార్గదర్శకులని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమంపై జిల్లా వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం ఆర్భాట ప్రచారానికి, క్షేత్రస్థాయిలో పరిస్థితికి ఏ మాత్రం పొంతన లేకుండా పోయింది. ఆగస్టు 15వ తేదీకల్లా జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. ఈ టార్గెట్‌పై జిల్లా యంత్రాంగం తీవ్ర ఒత్తిడికి లోనవుతోంది.

ఎవరూ ఆసక్తి చూపకపోవడం

ప్రభుత్వం చెప్పిన దత్తత ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఏ మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. పేదలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకు రాని దుస్థితి. దీంతో కూటమి ప్రభుత్వం ఉద్యోగులను టార్గెట్ చేసింది. పలు చోట్ల ఉద్యోగులనే మార్గదర్శకులుగా నమోదు చేస్తున్న పరిస్థితులున్నాయి. జిల్లాలో మొత్తం 65,451 బంగారు కుటుంబాలను సర్వేలో గుర్తించారు. ఈనెల 1వ తేదీన అధికారిక నివేదికల ప్రకారం జిల్లాలో 33,386 కుటుంబాలను 2583 మంది దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులను గుర్తించినట్లు పేర్కొన్నారు. అయితే ఇంకా జిల్లాలో 32,030 కుటుంబాలకు కూటమి ప్రభుత్వం మార్గదర్శకులను ఏర్పాటు చేయాల్సి ఉంది. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకు రాకపోవడంతో సచివాలయ ఉద్యోగులు, టీచర్లు, ఇతర శాఖల ఉద్యోగులను టార్గెట్ చేశారు. సచివాలయ ఉద్యోగులు మూడు నుంచి ఐదు కుటుంబాలను దత్తత తీసుకోవాలని అధికారులు ఒత్తిడి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారు. సచివాలయ ఉద్యోగుల జీతం రూ.30 వేలలోపే ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ జీతంతోనే వారి కుటుంబం గడవాల్సిన పరిస్థితి. అలాంటి చిరుద్యోగులైన సచివాలయ ఉద్యోగులు పేదలైన బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటే ఏ విధంగా న్యాయం చేస్తారో ప్రభుత్వమే సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

టీచర్లపై తీవ్ర ఒత్తిళ్లు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఉపాధ్యాయుల్లోనూ ఈ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం చెబుతున్న మేరకు బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న మార్గదర్శకులు ఆ కుటుంబం ఉండడానికి ఇల్లు, బతకడానికి ఉపాధి, కుటుంబంలోని పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం, ఆరోగ్య పరంగా ఇబ్బందులుంటే ఆదుకోవడం వంటి అనేక లక్ష్యాలను చేయాల్సి ఉంటుంది. సచివాలయ ఉద్యోగులకు ఈ లక్ష్యం విధిస్తే ఏ విధంగా నెరవేరుతుందో ప్రభుత్వమే సమాధానం చెప్పాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో టీచర్లపై ఒత్తిడి తీసుకురావడం సరైన పద్ధతి కాదని ఉపాధ్యాయ సంఘం నేతలు భగ్గుమంటున్నారు.

సీఎం నియోజకవర్గానికే దిక్కు లేదు..

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహించే కుప్పం నియోజకవర్గంలోనే మార్గదర్శకులకు దిక్కు లేని పరిస్థితి. ఇక రాష్ట్ర వ్యాప్తంగా పీ-4 కార్యక్రమం పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. సీఎం ప్రాతినిధ్యం వహించే కుప్పం నియోజకవర్గంలో మొత్తం బంగారు కుటుంబాలు 10,407ను గుర్తించారు. ఆ కుటుంబాల్లో 34,441 మంది కుటుంబ సభ్యులున్నారు. ఈనెల 1వ తేదీ నాటికి కుప్పం నియోజకవర్గంలో 3,068 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ఇంకా 7,339 కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆ నియోజకవర్గంలో 657 మంది మార్గదర్శకులను మాత్రం నమోదు చేశారు. ఈ కార్యక్రమం వల్ల పేదలకు ఒరిగేదేమి ఉండదని, కేవలం కూటమి ప్రభుత్వం ఆర్భాటం కోసమేనని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

ముఖం చాటేస్తున్న ఎమ్మెల్యేలు

కూటమి ప్రభుత్వం పీ-4 కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు ఆర్భాట ప్రచారం చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లి గ్రామంలో 250 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే ఆ వివరాలేవీ ఆన్‌లైన్‌లో కనిపించని పరిస్థితి. అంత వరకు బాగానే ఉన్నప్పటికీ ఆ నియోజకవర్గంలో షాడో ప్రజాప్రతినిధి ఇంత వరకు ఎన్ని కుటుంబాలను దత్తత తీసుకున్నారో తెలియని పరిస్థితి. అదే విధంగా చిత్తూరు, పూతలపట్టు, నగరి, గంగాధరనెల్లూరు, పలమనేరు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు ఎంత మందిని దత్తత తీసుకున్నారో ప్రజలెవ్వరికీ తెలియని దుస్థితి.

పీ-4 కార్యక్రమంలో జిల్లా పురోగతి ఇలా..

నియోజకవర్గం	బంగారు కుటుంబాలు	దత్తత తీసుకోవాల్సివి
చిత్తూరు	7,953	7,347
గంగాధరనెల్లూరు	11,573	4,473
కుప్పం	10,407	7,336
నగరి	5,135	223
పలమనేరు	10,106	3,514
పుంగనూరు	9,541	1,312
పూతలపట్టు	10,736	7,825
మొత్తం	65,451	32,030

కూటమి ప్రభుత్వం ప్రారంభించిన పీ-4 కార్యక్రమంపై సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ముఖం చాటేస్తున్న పరిస్థితులున్నాయి. కూటమి పార్టీలోని జనసేన, బీజేపీ అయితే పీ-4పై అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పూర్తి బకాయిలు చెల్లించండి.. దత్తత పరిశీలిస్తాం



టీచర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు మొత్తం చెల్లిస్తే పీ-4 కార్యక్రమంలో దత్తత అంశం పరిశీలన చేస్తాం. కూటమి ప్రభుత్వం టీచర్లకు ఇవ్వాల్సిన బకాయిలు ఏడాది పూర్తి అవుతున్నా ఇంత వరకు చెల్లించని దుస్థితి. మధ్య తరగతి శ్రేణిలో ఉండే టీచర్లకు కొన్ని కుటుంబాలను బంగారు కుటుంబాల పేరుతో దత్తత తీసుకోమనడం దారుణం. దత్తత తీసుకునే అంశం ఐచ్ఛికంగా ఉండాలి తప్ప ఒత్తిడి చేయడం సరికాదు. – రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్

ఒత్తిడి చేయడం సరికాదు



టీచర్లందరూ ఇప్పటికే బోధనేతర కార్యక్రమాలతో సతమతం అవుతున్నారు. ప్రభుత్వం పీ-4 అనే కార్యక్రమం పెట్టకపోయినా తమ వంతు బాధ్యతగా పేద విద్యార్థులకు సహాయ సహకారం అందిస్తున్నాం. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అయితే కూటమి ప్రభుత్వం పీ-4 కార్యక్రమం పేరుతో దత్తత తీసుకోవాలని నిర్బంధం చేయడం సరైన పద్ధతి కాదు. – జీవీ.రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నేతల చేరిక





నడుమూరులో కుమార్‌రాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్న మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి , ఆమినిగుంటలో పార్టీలో చేరిన రమేష్‌నాయుడు, హరి

చౌడేపల్లె : తెలుగుదేశం పార్టీని విడిచి వైఎస్సార్‌సీపీలోకి శెట్టిపేట పంచాయతీ తోటకురప్పల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత (ప్రస్తుత రేషన్ షాపు డీలర్) కుమార్‌రాజు, ఆమినిగుంట పంచాయతీ సింగిరిగుంటకు చెందిన రమేష్ నాయుడు, హరి ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మాజీ బోయకొండ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ సమక్షంలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ కండువాను వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ..కూటమి పాలన నచ్చకనే తెలుగుదేశం పార్టీని విడిచి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు పేర్కొన్నారు.

ఆదివారం మండలంలోని పందిళ్లపల్లె, ఆమినిగుంట గ్రామ పంచాయతీల్లో జరిగిన బాబూ షూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, సర్పంచులు ఓబుల్‌రెడ్డి, షంషీర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం, నాయకులు సుబ్రమణ్యం రాజు, హనుమంతురెడ్డి, సాధిక్, శంకర్‌రెడ్డి, శంకరప్ప, గంగాధర్, అనుప్రియ, హరి పాల్గొన్నారు.

సిరివెన్నెల గీతాలు చిరస్మరణీయం



పురస్కారాలు అందుకున్న వారితో దేవేంద్రరావు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : సిరి వెన్నెల గీతాలు ప్రజల మదిలో కలకాలం నిలిచే ఉంటాయని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నారాయణస్వామి, ఎం.వి.కేశవరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని రెడ్డి భవన్‌లో ఆదివారం ప్రముఖ సాహితీవేత్త మద్రిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో 'సిరివెన్నెల సాహితీ వైభవం' పేరిట గీతాలాపన, కవితార్చన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు సినీ చరిత్రలో గొప్ప పద ప్రయోగాలతో సిరివెన్నెల పాటల ప్రస్థానమే ప్రత్యేక అధ్యాయంగా సాగిందన్నారు. ప్రముఖ రచయితలు వందిపాటి చక్రపాణి డా.కొఠారి వెంకటరత్నం, శాంతకుమారి మాట్లాడుతూ.. కవితాత్మను కళాత్మకంగా ఆవిష్కరించడం ఒక్క సిరివెన్నెల సీతారామశాస్త్రికే చెల్లిందన్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పోస్ట్ డాక్టోరల్ కె.సి. లావణ్య, శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పోస్ట్ డాక్టోరల్ జి. సుభాషిణి, కర్ణాటక సార్వత్రిక విశ్వవిద్యాలయం పోస్ట్ డాక్టోరల్ బి. చక్రవర్తి మాట్లాడుతూ.. తన పాటలలో భావాల ముల్లేలు గుదిగుచ్చి, చిరుదీపంలా మొదలై అఖండ దీపంలా సిరివెన్నెల ప్రజ్వరిల్లారన్నారు. 50 మంది రచయితలకు, సంఘ సేవకులకు సిరివెన్నెల జాతీయ పురస్కారాలు 2025ను ప్రముఖ సాహితీవేత్త దేవేంద్రరావు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నయాకేర్ ఫౌండేషన్ (విజయవాడ) వ్యవస్థాపకులు ఎడ్లపల్లి మాధుర్య, తోటగోవిందన్, ఎం.శ్రీరాజు, ఎస్. మునీంద్ర పాలకూర కన్నయ్య, రఘుపతి, రెడ్డిపల్లి షాజహాన్, సోము ఉమాపతి, గొడుగుచింత గోవిందయ్య, ఆర్.ఎస్.రాజన్, కె.హరిప్రసాద్ రెడ్డి, జ్ఞానశేఖర్ రెడ్డి, రోహిత్ కుమార్, పురుషోత్తం ఆచారి, జి.శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్డున్న చోటే బియ్యం!

- డీలర్లకు ఇచ్చే అదనం 10 శాతం కట్
- కేటాయింపుల మేరకే బియ్యం సరఫరా
- స్థానికేతర కార్డుదారులకు తిప్పలు
- కొత్తగా ఎక్కడ కార్డు ఉంటే అక్కడే బియ్యం నిబంధనలు
- 31 మండలాలకు ముగ్గురే సివిల్ సప్లయి డీటీలు
- అధికారుల పర్యవేక్షణ కరువు



చౌకదుకాణం వద్ద పడిగాపులు పడుతున్న లబ్ధిదారులు (ఫైల్)

కాణిపాకం : అంతా ఆన్‌లైన్ నేపథ్యంలో రేషన్ కార్డు ఎక్కడున్నా.. రాష్ట్రంలోని ఏ రేషన్ డీలరు వద్దనైనా నిత్యావసర సరుకులు తీసుకునే వెసులుబాటు ఇప్పటి వరకు ఉండేది. ఈ నిబంధన 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కల్పించారు. అంతేకాకుండా సాధారణంగా ఆ రేషన్ డీలర్‌కు ఇవ్వాల్సిన సరుకుల అలాట్‌మెంట్‌తో పాటు అదనంగా 10 శాతం బియ్యం ఇచ్చేవారు. దీంతో డీలర్ తమ పరిధిలోని రేషన్ కార్డుదారులకు ఇవ్వాల్సిన బియ్యం ఇవ్వడంతోపాటు ఆ అదనపు బియ్యాన్ని సమీప ప్రాంతాలకు చెందిన వారు వస్తే వారికి ఇచ్చేవారు. తాజాగా ఈనెల నుంచి అదనపు బియ్యాన్ని కట్ చేశారు. దీంతో రేషన్‌కార్డు ఒకచోట ఉండి..వేరేచోట పనులు చేసుకునేవారికి బియ్యం ఇవ్వమని డీలర్లు చెబుతుండడంతో స్థానికేతర కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు.

రేషన్ డీలర్లకు వారికి వచ్చే బియ్యంతో పాటు అదనంగా ఇస్తున్న 10శాతం బియ్యాన్ని కట్ చేశారు. దీంతో 90శాతం రేషన్ డీలర్లు తమ షాపు పరిధిలోని కార్డుదారులకు మాత్రమే బియ్యం ఇస్తున్నారు. దీంతో స్థానికేతరులకు బియ్యం ఇవ్వలేమని తేల్చి చెప్పేస్తున్నారు. దీంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

కిలో తగ్గించి ఇవ్వాలని..

ఉపాధి నిమిత్తం ఇతర జిల్లాలకు చెందిన పలువురు పెద్ద సంఖ్యలో జిల్లాకు వచ్చారు. వీరంతా సంవత్సరాలుగా ఇక్కడే ఉంటున్నారు. వీరు రేషన్ డీలర్ వద్దకు వెళ్లి బియ్యం ఇవ్వమని అడుగుతున్నారు. స్థానికేతరులకు ఇవ్వడం కుదరని చెప్పడంతో ఒక కేజీ తగ్గించి ఇవ్వమని ప్రాధేయపడుతున్నారు.

ముగ్గురే సివిల్ సప్లయి డీటీలు

రేషన్ డీలర్ల పనితీరును పర్యవేక్షణ చేయడానికి ఒక్కో మండలానికి ఒక్కో సివిల్ సప్లయి డీటీ ఏళ్ల తరబడి పనిచేస్తున్నారు. అయితే కూటమి సర్కారులో జిల్లాలో 31 మండలాలు ఉంటే కేవలం మూడు మండలాలకు మాత్రమే సివిల్ సప్లయి డీటీలు పనిచేస్తున్నారు. మిగిలిన 31 మండలాలకు డీటీలు లేరు. దీంతో డీలర్ల పనితీరును చూసే అధికారే కరువయ్యారు. మరోవైపు జిల్లాలో 1390 రేషన్ దుకాణాలు ఉంటే 200కు పైగా డీలర్లు లేరు. సమీపంలోని పక్క డీలర్లకు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు. అక్కడి పరిస్థితులు గందరగోళంగా మారాయంటూ చర్చించుకుంటున్నారు.

ఎండీయూ వాహనాలు రద్దు



గత వైఎస్సార్‌సీపీ సర్కారు తీసుకొచ్చిన 336 ఎండీయూ వాహనాల ద్వారా నేరుగా ఇంటికే వచ్చి కార్డుదారులకు సరుకులు ఇచ్చేవారు. ఆ వాహనాలను రద్దు చేశారు. డీలర్ వద్దకే వెళ్లి సరుకులు తీసుకోవాలనే నిబంధనలు పెట్టారు. డీలర్లు అడిషనల్ కోట 10శాతం బియ్యం ఇవ్వకపోవడంతో 1 నుంచి 6వ తేదీకే సరుకులు ఇచ్చేశామంటూ దుకాణాలను మూత వేస్తున్నారు.

స్థానికేతరుల పరిస్థితి దారుణం



జీవనోపాధి కోసం బయటకు వలస వెళ్తే గతంలో అక్కడే రేషన్ తీసుకునే సదుపాయం ఉండేది.కానీ ప్రస్తుతం అలా లేదు.సంబంధించిన షాపుల్లోనే సరుకులు తీసుకోమని డీలర్లు చెబుతున్నారు. దాంతో ఉపాధి కోసం బయటిజిల్లాలకు వలస వెళ్తే ఇక రేషన్ ఇవ్వమంటే ఎలా బతకాలి. – రమేష్ యాదవ్, దొనిరేవులపల్లి

ఎక్కడైనా ఇచ్చేలా వెసులుబాటు కల్పించాలి



ముందు మాదిరి ఇప్పుడు లేదు. అప్పుడు రేషన్ బండి ఇంటికి వచ్చి రేషన్ ఇచ్చేది. ఇప్పుడు బండిని ఆపేశారు. రేషన్ షాపులోకి వెళ్లి సరుకులు తెచ్చుకునేందుకు పడిగాపులు కాస్తున్నాం. ఇక్కడ ఇవ్వని పక్షంలో వేరే షాపునకు వెళ్తే రేషన్ ఇవ్వడం లేదు. ఇదేమని అడిగితే దురుసుగా మాట్లాడుతున్నారు. ఆ వెసులుబాటు అయినా కల్పించాలి. – మహేశ్వరి ఏడీ కండ్రిగ

అందరికీ రేషన్ ఇవ్వాలి

బియ్యం కోసం డీలర్ వద్దకు వచ్చే ప్రతి కార్డుదారుడికి బియ్యం ఇవ్వాలి. 10 శాతం బియ్యాన్ని అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదు. వారికి ఇచ్చిన బియ్యం అయిపోతే...స్టాక్ లేకుంటే సివిల్ సప్లయి అధికారులకు సమాచారం ఇస్తే మళ్లీ గోదాము వద్ద నుంచి బియ్యం పంపుతాం. మిగిలిన మండలాలకు ఏర్పాటు చేస్తాం. జిల్లాలో డీలర్లు లేని వాటిని భర్తీ చేస్తాం. – శంకరన్, డీఎస్ఓ, చిత్తూరు

యూరియాకు అగచాట్లు



యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు (ఫైల్)

- జిల్లాలో వేధిస్తున్న కొరత
- సాగు విస్తీర్ణానికి తగ్గట్టు సరఫరా కాని వైనం
- ప్రైవేటు షాపులకు కేటాయింపులు
- రైతు భరోసా కేంద్రాలకు ఇవ్వని వైనం

కాణిపాకం : జిల్లాలో యూరియా కొరత రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద బారులు తీరి పడిగాపులు కాస్తున్నారు. ఇదే అదనుగా ఎరువుల వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. కొరతను సాకుచూపి అందిన కాడికి దండుకుంటున్నారు. అయినా వ్యవసాయ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో వరితో పాటు ఇతర పంటలు వేల హెక్టార్లల్లో సాగువుతోంది. వరి నాట్లు అధికంగా పడుతున్నాయి. దీనికి తోడు కూరగాయలు, వివిధ రకాల పండ్లతోటలు విస్తారంగా సాగు చేస్తున్నారు. ఇందుకు కావాల్సిన యూరియాను ప్రభుత్వం పంపిణీ చేయడం లేదు. అరకొరగా పంపిణీ చేస్తోంది. నెల రోజులుగా చూస్తే రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 57 టన్నులు మిగులు ఉంది. రైతు భరోసా కేంద్రాలు 502 ఉండగా అన్నింటిలో యూరియా లేదు. సహకార సంఘాలు 5, ప్రైవేటు షాపుల్లో 200కు గాను 50 షాపుల్లో మాత్రమే యూరియా నిల్వలున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అరకొర యూరియా కోసం జిల్లాలోని రైతులు కుస్తీ పడుతున్నారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చిత్తూరు నగరం మురకంబట్టు ప్రాంతంలో చోటు చేసుకుంది. తాలూకా పోలీసుల వివరాల మేరకు...తవణంపల్లి మండలం టి.పుత్తూరు గ్రామానికి చెందిన పృధ్వీ (28) బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతడు ఏడాది కిందట మురకంబట్టుకు చెందిన నవ్య అనే యువతిని ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. అప్పుల భారం పెరగడంతో బెంగుళూరు నుంచి వచ్చేశాడు. మురకంబట్టులోని భార్య ఇంట్లోనే ఉంటున్నాడు. శనివారం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి గోవిందయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి ఏనుగు సంచారం

పాకాల: మండలంలోని చింతలవంక, వల్లివేడు పరిసర ప్రాంతాల్లో ఒంటరి ఏనుగు సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు ఆదివారం గుర్తించారు. వారు మాట్లాడుతూ స్థానిక గ్రామాలతోపాటు కొమ్మిరెడ్డిగారిపల్లి క్రాస్‌రోడ్డు నుంచి కొత్తపల్లికి వెళ్లే రోడ్డు మార్గంలో రాత్రి పూట ప్రయాణం చేయకూడదని సూచనలు చేశారు. రాత్రి సమయాల్లో కాకర్లవారిపల్లి, మొరవపల్లి, పుల్లావాండ్లపల్లి, కొండకిందపల్లి, నడుంపల్లి, పరిసర ప్రాంతాల్లోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రైతులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. రాత్రి సమయాల్లో రైతులు పొలాల వద్ద బస చేయడం, వ్యవసాయ పనులు చేయడం వంటివి చేయకూడదని, చీకటి పడిన తరువాత పొలాల నుంచి ఇంటికి వచ్చేయాలని, ఒంటరి ఏనుగు సంచారంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏనుగు సంచారంపై సమాచారాన్ని 8309255631 నంబర్‌కు తెలియజేయాలని అటవీశాఖ అధికారులు కోరారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలు




రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులు

రొంపిచెర్ల : ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయలైన సంఘటన మండలంలోని పెద్దగొట్టిగల్లు సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రొంపిచెర్ల మండలం బోడిపాటివారిపల్లెకు చెందిన గణేష్ (28), చిన్న గొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లెకు చెందిన రమేష్ (45), ఇరువురు ద్విచక్ర వాహనంలో పీలేరు నుంచి స్వగ్రామాలకు వెళుతుండగా పెద్దగొట్టిగల్లు సమీపంలోని రెడ్డి చెరువు వద్ద అదుపు తప్పి రోడ్డు మీద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గణేష్ పరిస్థితి విసమంగా ఉండడంతో రుయా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అసమర్థ పాలనకు నిదర్శనం

- ప్రభుత్వ హాస్టళ్లను నిర్వీర్యం చేసేందుకు కూటమి కుట్ర
- విద్యార్థి సంఘాలపై ఆంక్షలు విధించడం దారుణం



ఎమ్మార్‌పల్లి సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

తిరుపతి సిటీ: కూటమి సర్కారు అసమర్థ పాలన బట్టబయలవుతోంది. ఇందులో భాగంగానే విద్యార్థులపై తన వితండవాదాన్ని రుద్దుతోంది. ప్రభుత్వ హాస్టళ్లలోకి, పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలకు అనుమతి నిరాకరిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీన్ని నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆదివారం ఎమ్మార్‌పల్లిలో నిరసన ర్యాలీ చేశారు. వసతి గృహాల్లో తమ వైఫల్యాల్ని బయటకు పొక్కనీయకుండా బ్రేక్ వేయాలనే లక్ష్యంతో విద్యార్థి సంఘాలను విద్యాసంస్థలోనికి అనుమతించకూడదని జిల్లా అధికారులకు కూటమి సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ఆరుబయట ఆత్మగౌరవం, పెచ్చులూడుతున్న భవనాలు, పడకేసిన పారిశుద్ధ్యం, కటిక నేల పట్టుపాన్పు, పౌష్టికాహార లేమితో విద్యార్థులు అవస్థ పడుతున్న వాస్తవాలను వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులతోపాటు పలు విద్యార్థి సంఘాలు వెలుగులోకి తెచ్చాయి. దీంతో వాస్తవాలను బయట పెడతారా? అంటూ ప్రభుత్వం విద్యార్థి సంఘాలకు అనుమతి ఇవ్వరాదంటూ అధికారులకు హుకుం జారీ చేసింది.

భగ్గుమన్న విద్యార్థి లోకం

ప్రభుత్వ ఆంక్షలపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో తిరుపతి ఎమ్మార్‌పల్లి సర్కిల్ వరకు ర్యాలీగా వచ్చి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రతులను తగులపెట్టి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. పాలన చేతకపోగా ప్రశ్నించి వారిపై కక్ష్యసాధింపు చర్యలు తీసుకోవడం అసమర్థపాలనకు నిదర్శనమని మండిపడ్డారు. తక్షణం ఆ ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలతో ప్రభుత్వం మెడలు వంచక తప్పదని హెచ్చరించారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఆంక్షలు విధిస్తారా!



పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో మౌళిక వసతులపై విద్యార్థి లోకం గళమెత్తితే ప్రభుత్వం తప్పుగా భావించి ఆంక్షలు విధించడం దారుణం. ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టల్స్‌లో మనుషులు నివాసముండే పరిస్థితి లేదు. అత్యంత దారుణంగా వసతల లేమితో, నాసిరకం ఆహారంతో విద్యార్థులు నరకకూపంలో జీవిస్తున్నారు. వీటిపై విద్యార్థుల సంఘాలు ప్రశ్నిస్తే వారిపై కక్ష్య సాధింపు చర్యలు దిగడం, పాఠశాలలోకి అనుమతులు ఇవ్వదని అధికారులకు హుకుం జారీ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. వెంటనే ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని లేదంటే పోరాటాలకు సిద్ధమవుతాం.

– ఆర్ ఆష, పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి, తిరుపతి

విద్యార్థి సంఘాలపై కక్ష్య సాధింపు ప్రమాదకరం



ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు ప్రజాస్వామానికి గొడ్డలిపెట్టు వంటివి. విద్యార్థి సంఘాలు విద్య వ్యవస్థలోని లోపాలు, సమస్యలపై ప్రశ్నించకపోతే పాఠశాలలు, కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వ హాస్టల్స్ అత్యంత దారుణంగా తయారవుతాయి. విద్యార్థుల నోరు మూయిస్తే పరిస్థితి దారుణంగా ఉంటుంది. ప్రభుత్వ మనుగడ సైతం కష్టమయ్యే పరిస్థితి నెలకొంటుంది. విద్యావ్యవస్థను కాపాడుతోంది కేవల విద్యార్థి సంఘాలే అని చెప్పవచ్చు.

– సంపూర్ణమ్మ, విశ్రాంత అధ్యాపకులు, తిరుపతి

విద్యార్థి సంఘాలతో పెట్టుకోవడం ప్రమాదకరం



కూటమి ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలలో భాగంగా విద్యార్థుల సమస్యలపై నోరువిప్పే విద్యార్థి సంఘాలపై సైతం తన ప్రతాపాన్ని చూపుతోంది. విద్యార్థి సంఘాలతో పెట్టుకుంటే పరిస్థితులు దారుణంగా ఉంటాయి. పాఠశాలలోనూ, వసతిగృహాలలోనూ విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. పౌష్టికాహారం అందక, కనీసం నిద్రించేందుకు సదుపాయాలు లేకుండా అరకొర వసతులతో మగ్గుతున్నారు. వీటిపై ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగడం దారుణం. ఆంక్షలు విధించి ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రభుత్వం భయపడినట్టు స్పష్టమైంది.

– శివశంకర్ నాయక్, జీఎస్ఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర



రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలతో విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతోంది. వసతి గృహాలు, పాఠశాలలోకి విద్యార్థి సంఘాలకు అనుమతులు లేకుండా కట్టడి చేయడంతోనే కూటమి ప్రభుత్వ కుట్ర తేటతెల్లమైంది. అక్కడ జరగుతున్న పరిస్థితులను విద్యార్థి సంఘాలు నిలదీయడంతో ప్రభుత్వం ఏమి చేయాలో పాలుపోకుండా ఆంక్షలు విధిస్తూ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. కక్ష్య సాధింపు చర్యలలో భాగంగానే ఇలాంటి దుచర్యలకు పాల్పడుతోంది. బడుగు బలహీన వర్గాలు చదువుకునే ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌ను అభివృద్ధి చేసి, మౌళిక వసతులను కల్పించాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయడం దారుణం.

– రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ టీచర్, తిరుపతి

ప్రభుత్వంపై తిరుగుబాటు తథ్యం



కూటమి ప్రభుత్వం వసతిగృహాలు, పాఠశాలలను సర్వనాశనం చేసింది. విద్యార్థి సంఘాలు సంక్షేమ హాస్టళ్లను విజిట్ చేసిన సందర్భంగా ప్రభుత్వం డొల్లతనం బయటపడింది. దీంతో కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతోంది. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లాలోని అన్ని వసతి గృహాలను జల్లెడ పట్టి అక్కడి పరిస్థితులపై జిల్లా అధికారులకు తెలియజేసింది. దీంతో కూటమి సర్కారు ఇలాంటి దారుణమైన ఉత్తర్వులు జారీ చేయడం ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనం.–డాక్టర్ బి ఓబుల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసే ప్రయత్నమే



ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాసేందుకే విద్యార్థి సంఘాలపై ఆంక్షలు విధించింది. రాష్ట్రంలో నియంతృత్వ పాలన నడుస్తోంది. పేద విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్ర జరుగుతోంది. విద్యార్థి సంఘాలను పాఠశాలలు, వసతిగృహాల్లోకి అనుమతించకుండా చేయడమంటే అవినీతిని ప్రొత్సహించడమే. వెంటనే ఉత్తర్వులను వెనక్కి తీసుకకపోతే విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

– రవి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

ఆంక్షలతో ఉద్యమాలను ఆపలేరు!



విద్యార్థి సంఘాలపై కూటమి ప్రభుత్వం ఆంక్షలు విధించడం దారుణం. ఇలాంటి ఆంక్షలతో ఉద్యమాలను ఆపలేరు. రాష్ట్ర చరిత్రలో ఇలాంటి దుర్మార్గపు నిర్ణయాలు ఏ ప్రభుత్వం తీసుకోలేదు. పాఠశాల విద్యను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నింది. అందులో భాగంగానే ఇలాంటి ఆంక్షలతో ఉత్తర్వులు జారీ చేస్తోంది. పునరాలోచించి ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలి.

– శివారెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి

6 నుంచి తొండమాన్‌పురం వెంకన్న పవిత్రోత్సవాలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆదివారం టీటీడీ పీఆర్వో ఓ ప్రకటన విడుదల చేశారు. 6వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పరణంతో పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 7వ తేదీ ఉదయం పవిత్ర ప్రతిష్ఠ, సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, 8వ ఉదయం పవిత్ర సమర్పణ, సాయంత్రం చతుష్టానార్చన నిర్వహించనున్నారు. 9వ ఉదయం మహా పూర్ణాహుతి, పవిత్ర వితరణ, స్నపనతిరుమంజనం, చక్రస్నానంతో పవిత్రోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. అనంతరం సాయంత్రం ప్రాకార ఉత్సవం, ఆస్థానం చేపడతారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

శ్రీ వేణుగోపాలస్వామివారి తెప్పోత్సవాలు

కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు తెప్పోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆదివారం టీటీడీ పీఆర్వో ఓ ప్రకటన విడుదల చేశారు. 6న శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామి, 7, 8వ తేదీల్లో శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ మూడు రోజుల పాటు ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నారు. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు చేపట్టనున్నారు.

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

బంగారుపాళెం : కడుపు నొప్పి తాళలేక ఆదివారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తుంబపాళ్యానికి చెందిన పవన్‌కళ్యాణ్ (28) కొంత కాలంగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. ఉదయం పొలం వద్ద పనులు చేసుకుంటుండగా తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి బంగారుపాళెం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వేల్లూరు సీఎంసీకి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎంపీ విడుదల కావాలంటూ ప్రార్థనలు

పుంగనూరు : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడంపై ముస్లింలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం ముస్లిం మైనార్టీ నాయకులు అస్లాంమురాధి, నయాజ్, అజ్మత్, అర్మన్, నవాజ్‌ఖాన్, వసీమ్ కలిసి నూర్‌షావలీ పెద్ద దర్గాలో ప్రార్థనలు చేశారు. అల్లా దయతో మిథున్‌రెడ్డి త్వరగా విడుదల కావాలని, కూటమి నేతలకు కళ్లు తెరిపించాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అస్లాం మురాధి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ వారిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు దోరణితో కేసులు పెట్టి, జైల్లో పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి చర్యలు మానుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు.



పుంగనూరు : దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మైనార్టీ నేతలు

ఆరిమాకులపల్లిలో పూజలు

శ్రీరంగరాజపురం : మండలంలోని తయ్యూరు పాయి కట్టు ఆరిమాకుల పల్లిలో వెలసిన ఆరిమాని గంగమ్మ ఆలయంలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జైలు నుంచి విడుదల కావాలని ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాలప్ప, నియోజకవర్గం సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు మణి, వలంటీర్ విభాగం అధ్యక్షుడు అశోక్, మేథావుల విభాగం అధ్యక్షుడు దామునాయుడు పాల్గొన్నారు.

ఐసర్ స్నాతకోత్సవం రేపు

ఏర్పేడు: మండలంలోని జంగాలపల్లిలో ఉన్న భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్) ఆరో స్నాతకోత్సవం మంగళవారం ఐసర్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థ డైరెక్టర్ డాక్టర్ సంతాను భట్టాచార్య తెలిపారు. ఆదివారం ఆయన ఐసర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇంద్రప్రీత్‌సింగ్ కోహ్లీతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐసర్ ఏర్పడి 10 ఏళ్ల గడిచిందని గుర్తు చేసుకున్నారు. మంగళవారం జరగనున్న ఆరో స్నాతకోత్సవం గొప్పగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో ఐసర్‌లో కోర్సులు పూర్తి చేసిన మొత్తం 255 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తామన్నారు. పట్టాలు అందుకోనున్న విద్యార్థులలో 22 మంది పీహెచ్‌డీ విద్యార్థులు, 8 మంది ఐపీహెచ్‌డీ విద్యార్థులు, ముగ్గురు ఎంఎస్ విద్యార్థులు, 141 మంది బీఎస్–ఎంఎస్ విద్యార్థులు, 69 మంది ప్రొఫెషనల్ మాస్టర్స్ విద్యార్థులు, ఆరుగురు బీఎస్ విద్యార్థులు, మరో ఆరుగురు బీఎస్సీ డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా గోదావరి బయోరిఫైనరీస్ చైర్మన్ సమీర్ సోమైయా, ఐసర్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్‌గా ఝిల్లుసింగ్ యాదవ్ పాల్గొంటారని చెప్పారు. స్నాతకోత్సవం మంగళవారం ఉదయం 9 గంటలకు ఐజర్‌లోని ఆడిటోరియంలో ప్రారంభం కానున్నట్లు తెలిపా రు. 2015లో ఐజర్ ప్రారంభించినప్పుడు తాము కేవలం బీఎస్–ఎంఎస్ కోర్సును మాత్రమే అందించామని, అయితే ప్రస్తుతం ఎన్నో పీహెచ్‌డీ ప్రోగ్రాంలు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న తిరుపతి ఐసర్ డైరెక్టర్ డాక్టర్ సంతాను భట్టాచార్య, చిత్రంలో రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్ సింగ్ కోహ్లీ

చిరుద్యోగుల కడుపుకొట్టిన కూటమి ప్రభుత్వం

చౌడేపల్లె: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలుచేయకపోగా చిరుద్యోగులను తొలగించి వారి కడుపుకొట్టారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ ఆరోపించారు. వారు ఆదివారం పందిళ్లపల్లె, ఆమినిగుంట, పరికిదొనలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం అర్హులందరికీ పథకాలు అందించామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏదో ఒక సాకుచూపి అర్హత ఉన్నా పథకాల్లో కోత విధిస్తోందని తెలిపారు. అందరికీ అన్ని ఇస్తున్నట్టు ఎల్లో మీడియా ద్వారా ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని ఆశ పెట్టి ఉద్యోగాలే లేకుండా చేసినట్టు ఆరోపించారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, రేషన్ షాపు డీలర్లు, సంఘ మిత్రలు తదితరులను అక్రమంగా తొలగించి వారి కుటుంబాలను రోడ్డున పడేశారని దుయ్యబట్టారు. కూటమి నేతల దౌర్జన్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి జైలుపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు.



నడుమూరులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

ఏకష్టమొచ్చినా పెద్దిరెడ్డి కుటుంబం అండగా ఉంటుంది

పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం అండగా ఉంటుందని వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. అక్రమ కేసులకు భయపడొద్దని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, సర్పంచులు షంషీర్ ఓబుల్‌రెడ్డి, మల్లీశ్వరి, లక్ష్మీదేవి, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, కోఆప్షన్ మెంబరు సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ కిటకిట

చౌడేపల్లె : పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తజన సందోహంతో పోటెత్తింది. సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో విద్యార్థులు, యువత, ఉద్యోగులు కుటుంబ సమేతంగా హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ అర్చకులు అమ్మవారిని అలంకరణ చేసి దర్శన భాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు దీపాలు వెలిగించి , బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. క్యూలైన్‌లో భక్తుల రద్దీతో తోపులాట చోటుచేసుకున్నాయి. భక్తులకు ఆలయ ఈఓ ఏకాంబరం పర్యవేక్షణలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



ఆలయంలో భక్తుల రద్దీ

నగరి–దిండివనం రైలు కూత

- 19 ఏళ్లుగా ఊరిస్తున్న రైల్వేలైన్‌కు మోక్షం
- కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు
- నగరిలోఎట్టకేలకు పనులు ప్రారంభం

నగరి : ఏళ్ల తరబడి నత్తనడకన సాగుతున్న నగరి–దిండివనం రైల్వేలైను ప్రాజెక్టుకు ఈఏడాది కేంద్ర బడ్జెట్‌లో రూ.350 కోట్లు కేటాయించడం, టెండర్లు పూర్తవడంతో నగరి నుంచి రైల్వేలైన్ పనులకు మోక్షం లభించింది. 2006లో రైల్వేశాఖ ప్రకటించిన దిండివనం–నగరి రైల్వేలైన్ ప్రాజెక్టు 19 ఏళ్లగా ప్రజలను ఊరిస్తూనే వస్తోంది. ఏళ్ల తరబడి నత్తనడకన సాగుతున్న ప్రాజెక్టుకు ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో రూ.350 కోట్లు కేటాయించడం, టెండర్లు పూర్తవడంతో నగరి నుంచి రైల్వేలైన్ పనులు ప్రారంభమయ్యాయి.

తమిళనాడు విల్లుపురం తిరువణ్ణామలై, వెల్లూరు నుంచి తిరువళ్లూరు జిల్లాకు రైలు మార్గాన్ని అనుసంధానం చేసేందుకు 2006లో రైల్వేశాఖ దిండివనం–నగరి రైల్వేలైన్ ప్రాజెక్టును ప్రకటించింది. ఇందులో భాగంగా విల్లుపురం జిల్లోలోని దిండివనం నుంచి రేణిగుంట – అరక్కోణం సెక్షన్‌లోని నగరి వరకు 184.5 కిలోమీటర్ల మేర కొత్త రైల్వేలైన్ నిర్మించేందుకు 2008లో 582.83 కోట్లు ప్రాజెక్టు వ్యయంగా నిర్ణయించి 2020లోపు పూర్తి చేసేందుకు రూ.20 కోట్ల నిధులు ఆ ఏడాది విడుదల చేశారు. ఆ నిధులతో 6 కిలోమీటర్ల మేర పనులు జరిగినా ఆపై భూసేకరణలో సమస్యలు ఎదుర్కొంటూ వస్తున్న ఈ ప్రాజుక్టుకు ఆపై పెరిగిన వ్యయాలు అందుకు తగ్గ నిధుల కేటాయింపు అనే అంశం భారంగా మారింది. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చాక 2020 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వాలాజా రోడ్డు నుంచి రాణిపేట వరకు ఎలక్ట్రిఫికేషన్‌తో పాటు పట్టాల ఏర్పాటు పనులు వేగంగా జరిగాయి. ఆపై భూసేకరణ సమస్యతో పాటు నిధుల సమస్య వెంటాడి పనులు మందగించింది. 2024 నాటికి ప్రాజక్టు వ్యయం 3361 కోట్లకు చేరగా మార్చి 31, 2027 నాటికి పూర్తి చేయాలని మళ్లీ లక్ష్యం నిర్ణయించారు. ఇప్పటి వరకు 81శాతం భూసేకరణ పూర్తయింది.

33 కి.మీ రైల్వేలైన్ పనులు ప్రారంభం

ఈ ఏడాది కేటాయించిన బడ్జెట్‌కు సంబంధిత టెండర్లు పూర్తవడంతో 33 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ నిర్మించేందుకు రైల్వేశాఖ సిద్ధమైంది. నగరి నుంచి పొదటూరుపేట వరకు 13 కిలోమీటర్లు, వాలాజా రోడ్డు నుంచి షోళింగర్ వరకు 20 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ నిర్మించనున్నారు. సంబంధిత పనులు నగరిలో ప్రారంభమై వేగంగా జరుగుతున్నాయి.



నగరి : ముడిపల్లి వద్ద జరుగుతున్న రైల్వే పనులు

22 స్టేషన్లను కలిపే మార్గం

రైలు మార్గం దిండివనం, వెల్లిమేడుపేట, తెల్లార్, వందవాసి, మాంబాక్కం, ఎరుమైవెట్టి, చెయ్యార్, ఇరుంగూర్, మామండూరు, ఆరణి, తామరైపాక్కం, తిమిరి, ఆర్కాట్, రాణిపేట నుంచి వాలాజా రోడ్డు జంక్షన్‌స్ మీదుగా కొడక్కల్, షోళింగర్, ఆర్‌కే పేట, అత్తిమాంజేరిపేట, పళ్లిపట్టు, పొదటూరుపేట మీదుగా నగరి వరకు చేరుకుంటుంది. ఏపీలోని నగరి వెళ్లేలా ప్లాన్ చేశారు. ఈ మార్గంలో 3 జంక్షన్లు, 13 క్రాసింగ్‌లు, 9 హాల్టులు ఉండే విధంగా పథక రచన చేశారు. 22 స్టేషన్లలో 18 కొత్త స్టేషన్లు రానున్నాయి. 26 మేజర్ వంతెనలు, 200 మైనరు వంతెనలు నిర్మించనున్నారు.



నగరి–దిండివనం రైల్వే లైన్ రూట్ మ్యాప్

ప్రాజెక్టు పూర్తయితే

ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఇది దక్షిణ రైల్వేలో మరో ముఖ్యమైన అనుసంధాన రైల్వే లైన్ అవుతుంది. ప్యాసింజర్, సరుకు రవాణా రైళ్లు విల్లుపురం నుంచి అరక్కోణం లేదా చెన్నైకి రావలసిన అవసరం ఉండదు. వాలాజా రోడ్ నుంచి నగరి మీదుగా రేణిగుంట మార్గంలో వెళతాయి. ముంబై, ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.